నాంపల్లిలో 9 నామినేషన్లు దాఖలు

నాంపల్లి: నియోజకవర్గంలో బుధవారం 9 నామినేషన్లు దాఖలు అయ్యాయి. మహ్మద్ షఫీ అహ్మద్ (బీఎస్పీ), మహ్మద్ నజీర్ అహ్మద్ అన్సర్ (బహుజన్ ముక్తి పార్టీ), బొప్పి గణేష్(పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), ఎ.శివకుమార్ (ధర్మ సమాజ్ పార్టీ), సమీన్ (జై మహాభారత్ పార్టీ), వి.ధన్‌రాజ్ (భారతీయ స్వదేశీ కాంగ్రెస్ పార్టీ), శిరాజ్ అమీనా(స్వతంత్ర), సీహెచ్.ఆనంద్‌కుమార్ గౌడ్ (బీఆర్ఎస్), బిల్లమ్ నరేందర్ (స్వతంత్ర) అభ్యర్థులు తమ నామ పత్రాలను 63–నాంపల్లి రిటర్నింగ్ అధికారి లావణ్యకు అందజేశారు.

చార్మినార్‌లో రెండు నామినేషన్లు

చార్మినార్: చార్మినార్ శాసన సభ నియోజకవర్గం నుంచి బుధవారం రెండు నామినేషన్‌లు దాఖలయ్యాయి. ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) అభ్యర్థి ఎస్.జయకృష్ణ తన నామినేషన్ పత్రాలను దాఖలు చేయగా.. గన సురక్ష పార్టీ అభ్యర్థి జ్యోతి శర్మ కూడా తన నామినేషన్ దాఖలు చేశారు.

‘మీరాలంమండి అమ్మవారి ఆశీస్సులతో విజయం సాధిస్తా’


అంజన్‌కుమార్‌యాదవ్‌ను సత్కరిస్తున్న గాజుల అంజయ్య

చార్మినార్: మీరాలం మండి మహాంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య బుధవారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ముషీరాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అంజన్‌కుమార్ యాదవ్‌ను కలిసి సత్కరించారు. ఈ ఎన్నికల్లో అంజన్‌కుమార్‌యాదవ్ విజయం సాధించాలని కోరుతూ ఆలయంలో పూజలు నిర్వహించిన గాజుల అంజయ్య ఆ ప్రసాదాన్ని అందజేశారు. అమ్మవారి ఆశీస్సులతో ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

పాతబస్తీ.. సమస్యలతో కుస్తీ

- స్థానికులను వెంటాడుతున్న పలు సమస్యలు
- మురికివాడల్లో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే..
- కాలిబాట పనులు పూర్తికావడంతో విశాలంగా మారిన చార్మినార్ పరిసరాలు


శిథిలావస్థకు చేరిన పురానీహవేలీలోని ప్రధాన రోడ్డు

చార్మినార్: చార్మినార్ నియోజకవర్గంలో అక్కడక్కడ అభివృద్ధి పనులు జరిగినప్పటికీ.. ఇంకా సమస్యలు స్థానికులను వెంటాడుతూనే ఉన్నాయి. ఏళ్ల తరబడి నత్తనడకన కొనసాగిన కాలిబాట పథకం పనులు పూర్తికావడంతో సందర్శకులు సంతోషం వ్యక్తం చేశారు. చార్మినార్ కట్టడం నలు వైపుల గ్రానైట్ పనుల సుందరీకరణ పూర్తి కావడంతో చార్మినార్ సందర్శనకు వచ్చే పర్యాటకులకు ఎంతో సౌకర్యంగా మారింది. దీంతో పాటు పాతబస్తీలోని వారసత్వ కట్టడాల పరిరక్షణలో భాగంగా ఖిల్వత్ క్లాక్ టవర్, చార్‌కమాన్‌ల సుందరీకరణ పనులు జరిగాయి తప్పా బస్తీలలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. నిజాం కాలం నాటి ముర్గీచౌక్‌లోని శిథిల భవనాన్ని కూల్చి దాని స్థానంలో అత్యంత ఆధునాతనమైన భవన నిర్మాణం కోసం నిధులు మంజూరవడంతో పాటు పనులు వేగంగా జరుగుతున్నాయి. చార్మినార్ నియోజకవర్గంలోని చాలా బస్తీలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. మినీ బస్సులను కొంతకాలం నడిపిన ఆర్టీసీ యజమాన్యం అనంతరం వాటిని రద్దు చేసింది. నగరంలోని అన్ని ప్రాంతాల్లో మెట్రో రైలు అందుబాటులోకి వచ్చినప్పటికీ చార్మినార్‌లో మెట్రో పనులు ఇంకా ప్రారంభమే కాలేదు. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన పురానాపూల్, ఎస్సీనగర్, పార్థివాడలోని క్వార్టర్స్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటి స్థానంలో డబుల్ బెడ్‌రూం ఇల్లు కట్టిస్తామని ఇచ్చిన హామీ నెరవేరలేదు. ప్రజా ప్రతినిధులు ఇక్కడి ప్రజలకు డబుల్ బెడ్ రూం కట్టిస్తామని వాగ్దానం చేశారు. మంత్రితో పాటు స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ ఈ బస్తీలను సందర్శించారు. సమావేశాలు నిర్వహించి కార్యాచరణ రూపొందించారు. అయితే పనులు మాత్రం ప్రారంభించలేదు.

మురికివాడల్లో కనీస సౌకర్యాలు కరువు..

చార్మినార్‌లోని పురాతన కట్టడాల వద్ద అభివృద్ధి పనులు జరుగుతున్నప్పటికీ.. నియోజకవర్గంలోని పత్తర్‌గట్టి, ఘాన్సీబజార్, పురానాపూల్, శాలిబండ, మొఘల్‌పురా డివిజన్లలోని మురికివాడల్లో రోడ్లు, డ్రైనేజీ, కలుషిత మంచి నీరు, రోడ్ల విస్తరణ తదితర సమస్యలతో స్థానిక పేద ప్రజలు సతమతమవుతున్నారు. ఇరుకు రోడ్లను విస్తరించాల్సిన అవసరమున్నప్పటికీ.. చాలా ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ పనులు మరుగున పడ్డాయి. గర్భిణుల సౌకర్యార్థం కొనసాగుతున్న పేట్లబురుజు మెటర్నిటీ ఆస్పత్రి, సూరజ్ భాన్ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రుల్లో మౌలిక వసతులు అందుబాటులో లేకపోవడంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు.

అందుబాటులో లేని క్రీడా మైదానాలు..

నియోజకవర్గంలో స్థానిక ప్రజల సౌకర్యార్థం ఆశించిన స్థాయిలో క్రీడా మైదానాలు అందుబాటులో లేవు. ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసుకోవడానికి పార్కులు లేవు. ఒకప్పుడు మొఘల్‌పురాలో అతి పెద్ద ప్లే గ్రౌండ్ అందుబాటులో ఉండగా.. ఇటీవల జీహెచ్ఎంసీ ఇక్కడ స్పోర్ట్స్ కాంప్లెక్స్ భవన సముదాయాన్ని నిర్మించడంతో ఆట స్థలం కనుమరుగైంది. నూర్‌ఖాన్‌బజార్ బాల్‌శెట్టికేథ్‌లోని ఆట స్థలాన్ని కుదించారు. ఇక్కడ విశాలంగా ఉన్న ఆట స్థలంలోని కొంత భాగంలో మంచినీటి రిజర్వాయర్ నిర్మించారు.


సీపీపీ పనులతో విశాలంగా మారిన చార్మినార్ కట్టడం పరిసరాలు

పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో..

సరైన పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో వ్యాపారాలు కుంటుపడుతున్నాయి. నగరంలోని ఇతర ప్రాంతాల వినియోగదారులే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా వినియోగదారులు, చిరు వ్యాపారులు పాతబస్తీకి వచ్చి ప్రతిరోజూ వ్యాపార లావాదేవిలను కొనసాగిస్తుంటారు. అయితే సరైన పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో తమ వాహనాలను ఎక్కడ పార్కింగ్ చేసుకోవాలో తెలియక ఇబ్బందులకు గురవుతున్నారు. పార్కింగ్ సమస్య కారణంగా పాతబస్తీలోని వస్త్ర వ్యాపారాలతో పాటు బంగారం, వెండి, ముత్యాలు తదితర వ్యాపారాలు కుంటు పడుతున్నాయి.

బీజేపీకే పూర్తి మద్దతు: మణిమారణ్


జీవీ మణిమారణ్

అబిడ్స్: బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకు రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి జీవీ మణిమారణ్ పేర్కొన్నారు. ఎన్‌డీఏలో తమ పార్టీ బలియామైన మిత్రపక్షమన్నారు. బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకు రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ కార్యకర్తలు, నాయకులు విశేషంగా కృషి చేయాలన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వంతోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ చెప్పినట్లుగా తెలంగాణలో మార్పు ఎంతో అవసరమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడుతూ ప్రజలకు ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. బీజేపీకి తమ పార్టీ పూర్తిగా మద్దతిస్తుందని ఆయన అన్నారు. బీజేపీ విజయానికి తమ పార్టీ శ్రేణులు ముందుంటారని మణిమారణ్ పేర్కొన్నారు.

‘రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభంజనం’


మధుయాష్కీతో కురాకుల కృష్ణ తదితరులు

గోల్కొండ: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభంజనం ప్రచండంగా ఉందని కాంగ్రెస్ రాష్ట్ర స్క్రీనింగ్ కమిటీ అధ్యక్షుడు మధుయాష్కీగౌడ్ అన్నారు. కార్వాన్ కాంగ్రెస్ నాయకులు కురాకుల కృష్ణ ఆధ్వర్యంలో బుధవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అభ్యర్థుల భారీ విజయం కోసం ప్రతి కార్యకర్త పని చేయాలన్నారు. తెలంగాణలో పదేళ్లుగా నిరుద్యోగం బాగా పెరిగిపోయిందని నిరాశలో నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆయన అన్నారు. ఎం.ఆర్.రెడ్డి, అమిత్‌ఖాన్, చంద్రశేఖర్, చంటిబాబు, కిషన్, వినోద్‌సింగ్, గోవర్ధన్‌రెడ్డి తదితరులున్నారు.

‘దేశంలో ప్రధాని మోదీ హవా’


గంగారామ్ ఆహీర్‌తో బీజేపీ నాయకులు

గోల్కొండ: దేశంలో ప్రధాని మోదీ హవా కొనసాగుతుందని బ్లాక్ వర్డు క్లాసెస్ కమిటీ జాతీయ చైర్మన్ హన్స్ రాజ్ గంగారామ్ ఆహీర్ అన్నారు. బుధవారం పలువురు బీజేపీ, బీజేవైఎం నాయకులు ఆయనను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎన్నికలు జరుగుతున్న ఐదు రాష్ట్రాల్లో కూడా భారీ మెజార్టీతో బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. తెలంగాణలో ప్రాంతీయ పార్టీల శకం ముగిసిందన్నారు. ఈ కార్యక్రమంలో సచిన్ కామ్లేకర్, బిజ్వర్‌సింగ్ తదితరులున్నారు.

రాజాసింగ్‌ను చిత్తుగా ఓడిస్తా: నందకిషోర్ వ్యాస్


మాట్లాడుతున్న నందకిషోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్: పదేళ్లుగా గోషామహల్ ప్రజలను అసత్య ప్రచారాలతో మోసం చేస్తున్న బీజేపీ అభ్యర్థి రాజాసింగ్ ఓడిపోవడం ఖాయమని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి నందకిషోర్ గ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. గోషామహల్ రోడ్డులోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కేవలం మతం పేరు చెప్పి రెండు పర్యాయాలు ఓట్లు దండుకున్న రాజాసింగ్ ఏ ముఖం పెట్టుకొని ప్రజల ముందుకు వస్తున్నారని అన్నారు. గోషామహల్ ప్రజలను గాక దేశవ్యాప్తంగా అందరినీ అబద్ధం మాటలు చెబుతూ మోసం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సహకారంతో గోషామహల్ నియోజకవర్గంలో కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేశామన్నారు .రాజాసింగ్ కేవలం మతం పేరు చెబుతూ దేశవ్యాప్తంగా పర్యటిస్తున్నాడే తప్పా గోషామహల్ ప్రజలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అభివృద్ధి విషయంలో తనతో చర్చకు వచ్చే దమ్ముందా అని రాజసింగ్‌ను నందకిషోర్ వ్యాస్ బిలాల్ ప్రశ్నించారు. దూల్‌పేటలో ఎమ్మెల్యే రాజా సింగ్ ఇంటి ముందు ఉన్న ప్లే గ్రౌండ్‌ను కబ్జా చేసి వాడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే జీహెచ్ఎంసీ కమిషనర్, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్లు రాజాసింగ్ కబ్జా చేసిన ప్లే గ్రౌండ్‌ను ప్రజలు వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ పరమేశ్వర్ సింగ్, బీఆర్ఎస్ నాయకులు ఆనంద్ సింగ్, అనిత, ధనరాజ్, పుష్ప పాల్గొన్నారు.

కార్వాన్‌లో విజయం నాదే: అమర్‌సింగ్

గోల్కొండ: కార్వాన్‌లో ఈసారి విజయం తనదేనని కార్వాన్ బీజేపీ అభ్యర్థి టి.అమర్‌సింగ్ అన్నారు. బుధవారం గుడిమల్కాపూర్ చౌరస్తా వద్ద గల బీజేపీ కార్యాలయంలో జరిగిన బీజేపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్లల్లో కార్వాన్ నియోజకవర్గం పరిస్థితి అధ్వానంగా మారిందన్నారు. అభివృద్ధి పనుల్లో అవినీతి చోటు చేసుకుందని ఆయన ఆరోపించారు. తాను నేడు నామినేషన్ తాఖలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సునీల్‌యాదవ్, నాయకులు సచిన్‌కామ్లేకర్ తదితరులున్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన ఎస్పీ క్రాంతి కుమార్



చార్మినార్: కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన ఎస్పీ క్రాంతికుమార్, శైలజ దంపతులు బుధవారం మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య అనుచరులుగా ఉన్న వీరు ఆయనతో పాటు బీఆర్ఎస్ పార్టీలోకి మారారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని బీసీ ప్రజలకు చేస్తున్న పలు సంక్షేమ పథకాలతో తాము బీఆర్ఎస్ పార్టీ వైపు ఆకర్షితులమయ్యామన్నారు.

నామినేషన్ వేసిన అక్బరుద్దీన్ ఒవైసీ


నామినేషన్ పత్రాలను అందజేస్తున్న మజ్లిస్ అభ్యర్థి అక్బరుద్దీన్ ఒవైసీ

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో బుధవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. మజ్లిస్ పార్టీ తరఫున ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీతో పాటు ఆయన కుమారుడు నూరుద్దీన్ ఒవైసీ కూడా నామినేషన్ వేశారు. ప్రతిసారి కార్యకర్తలతో పెద్ద ఎత్తున ర్యాలీగా వచ్చే అక్బరుద్దీన్ ఒవైసీ ఈసారి మాత్రం నిరాడంబరంగా నామినేషన్ దాఖలు ప్రక్రియను పూర్తి చేశారు. ఆయన వెంట కార్పొరేటర్ సలీం బేగ్, మాజీ కార్పొరేటర్ సమద్ బిన్ అబ్దాద్‌లు న్నారు. యుగ తులసి పార్టీ తరఫున ఆడాల కరుణ అనే మహిళా అభ్యర్థి నామినేషన్ దాఖలు చేశారు.

తండ్రి వెన్నంటే తనయుడు..

చార్మినార్: ఈసారి జరిగే ఎన్నికల్లో అక్బరుద్దీన్ ఒవైసీ కుమారుడు నూరుద్దీన్ ఒవైసీ పాతబస్తీలోని ఏదో ఒక నియోజకవర్గం నుంచి మజ్లిస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు ప్రచారం జరిగినప్పటికీ.. పోటీకి దూరంగా ఉన్న అతను ప్రస్తుతం తండ్రితో కలిసి ఎన్నికల ప్రచారంలో జోరుగా పాల్గొంటున్నారు. రియాసత్‌నగర్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో అక్బరుద్దీన్ ఒవైసీ వెంట ప్రచారంలో పాల్గొన్న నూరుద్దీన్‌కు స్థానిక ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. బుధవారం అక్బరుద్దీన్ ఒవైసీ తన నామినేషన్ దాఖలు చేయగా వెన్నంటే ఉన్నారు. అలాగే తను కూడా మరో సెట్‌ను దాఖలు చేశారు.

ఆనంద్‌కుమార్ గౌడ్‌కు సత్కారం


ఆనంద్‌కుమార్ గౌడ్‌ను సత్కరిస్తున్న బీఆర్ఎస్ నేతలు

నాంపల్లి: బీఆర్ఎస్ అభ్యర్థిగా రెండవసారి సీహెచ్.ఆనంద్‌కుమార్ గౌడ్‌ను ప్రకటించడం పట్ల కార్యకర్తలు బుధవారం సంబరాలు జరుపుకొన్నారు. నాంపల్లిలోని ఆనంద్‌కుమార్ గౌడ్ ఇంటిలో టపాకాయలు పేల్చి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్ఎస్ నేతలు అభ్యర్థి ఇంటికి చేరుకుని సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ నేత రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముఖేష్ రెడ్డి, నాంపల్లి బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఇన్‌చార్జి గడ్డం సుధేష్‌కుమార్, నాంపల్లి నియోజకవర్గం అధ్యక్షుడు సంగీత్ చౌహాన్, ప్రధాన కార్యదర్శి విక్రమ్‌కుమార్ పాల్గొన్నారు.

‘బతికి ఉన్నంత వరకు ప్రజల మధ్యే ఉంటా’


ఎమ్మెల్యేకు తులాభారం చేస్తున్న దృశ్యం

గోల్కొండ: సామాన్య కార్యకర్తగా మజ్లిస్ పార్టీలో రాజకీయ జీవితం ప్రారంభించానని ప్రజల అండదండలతో ఎమ్మెల్యే స్థాయికి ఎదిగానని ఇదంతా ప్రజల ఆశీర్వాదం వల్లే అని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన నానల్‌నగర్, గోల్కొండ డివిజన్లలో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయనను నానల్ నగర్ ఖాదర్‌బాగ్‌లో మజ్లిస్ ఆధ్వర్యంలో మిశ్రీ(కడి చక్కర)తో తులాభారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల అభిమానం తాను జీవితంలో ఏనాడు మరువనని బతికి ఉన్నంత కాలం ప్రజలతోనే ఉంటానని ఆయన అన్నారు. మజ్లిస్ పార్టీలో అన్ని వర్గాల వారికి సముచిత స్థానం ఇవ్వబడిందని ఆయన స్పష్టం చేశారు. ప్రజాభిమానంతో ఈసారి ఎన్నికల్లో కూడా తాను భారీ మెజార్టీతో విజయం సాధిస్తానని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, సీనియర్ మజ్లిస్ నాయకులు షబ్బీర్‌ఖాన్, బద్దర్‌ఉద్దీన్, హారూన్‌ఫరాస్ తదితరులున్నారు.

సునీతారావు నామినేషన్ దాఖలు


ఆర్‌ఓకు నామినేషన్ పత్రాలను అందజేస్తున్న సునీతారావు

అబిడ్స్: గోషామహల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మొగిలి సునీతా రావు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. బుధవారం అబిడ్స్ మున్సిపల్ కాంప్లెక్స్‌లోని గోషామహల్ ఆర్వో కార్యాలయంలో ఆర్ఓ. విక్టర్‌కు ఆమె బీ ఫారంతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం సునీతారావు మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లను ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఆమె పేర్కొన్నారు. పదేళ్లగా బీజేపీ ఎమ్మెల్యే గోషామహల్ నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. రాజాసింగ్ అభివృద్ధి చేయకపోవడంతో ప్రజలంతా వ్యతిరేకంగా ఉన్నారన్నారు. మైనార్టీలతోపాటు అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తున్నారని సునీతారావు పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌ను ప్రజలు చిత్తుగా ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అదేవిధంగా గోషామహల్ నియోజకవర్గంలో మరో ముగ్గురు వ్యక్తులు తమ నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.

చాంద్రాయణగుట్ట కాంగ్రెస్ అభ్యర్థి ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ అభ్యర్థి బోయ నగేష్

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట నియోజవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బోయ నగేష్ బుధవారం పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. బండ్లగూడ, చాంద్రాయణగుట్ట, బాబానగర్, రక్షాపురం కాలనీ, ఉప్పుగూడ, ఛత్రినాక, జంగమ్మెట్, బండ్లగూడ తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ మెంబర్ వంశీ చంద్ రెడ్డి, తెలంగాణ యూత్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి సురభి త్రివేది, టీపీసీసీ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్, సీనియర్ నాయకులు వెంకటేష్ ముదిరాజ్, రాజుయాదవ్, కాశమోని శ్యాంరావు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

‘సుజాత సుమాలు’ పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న హోం మంత్రి మహమ్మద్ అలీ

అబిడ్స్: ప్రముఖ కవయిత్రి, రచయిత్ర పోచం సుజాత రచించిన ‘సుజాత సుమాలు’ పుస్తకాన్ని హోంమంత్రి మహమూద్ అలీ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ.. పదేళ్లగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధికి ఎంతో కృషి చేసిందన్నారు. సాంస్కృతిక రంగాన్ని ఎంతో అభివృద్ధి పరిచిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. రచయిత్ర పోచం సుజాత మాట్లాడుతూ.. తెలుగు యూనివర్సిటీ తాను పుస్తకాన్ని రచించేందుకు గ్రాంటును విడుదల చేయడం ఎంతో సంతోషం కరంగా ఉందన్నారు. తెలుగు యూనివర్సిటీ ప్రోత్సాహంతోనే ఈ పుస్తకాన్ని రచించానని ఆమె యూనివర్సిటీ యజమానియానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నవభారత నిర్మాణ సామాజిక సేవ సంస్థ అధ్యక్షుడు విద్యావేత్త సూరేపల్లి రవి కుమార్, పోచం స్వామి, కవయిత్రి విజయలక్ష్మి, వడ్డేపల్లి సూరేపల్లి సంపత్ కుమార్ పాల్గొన్నారు.

కిలో రూ.25కే ఉల్లిపాయల విక్రయాలు



అబిడ్స్: ఉల్లిపాయాల ధరలు ఆకాశాన్ని అంటడంతో నేషనల్ కో ఆపరేటీవ్ కన్జూమర్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రూ.25లకే కిలో ఉల్లిపాయాలు విక్రయాలు చేపట్టారు. మార్కెట్‌లో రూ.70 నుంచి రూ.80కి పైగా కిలో ఉల్లిపాయాల విక్రయాలు జరుగుతుండడంతో ప్రజల సౌకర్యార్థం నేషనల్ కో ఆపరేటీవ్ ఆధ్వర్యంలో రూ.25కే కిలో విక్రయాలు చేస్తున్నట్లు వివరించారు. నగరంలోని కుత్బిగూడతో పాటు పలు ప్రాంతాల్లో ఉల్లిపాయల విక్రయాలు చేశామని నిర్వాహకులు వివరించారు.

బీఆర్ఎస్‌తోనే గోషామహల్ అభివృద్ధి


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు గడ్డం శ్రీనివాస్ యాదవ్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పెద్ద ఎత్తున అభివృద్ధి జరిగిందని నగర గ్రంథాలయ మాజీ చైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదేళ్లగా ఎమ్మెల్యే రాజాసింగ్ ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. నియోజకవర్గం నలుమూలలా ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ హయాంలో డబుల్‌బెడ్‌రూమ్‌ల నిర్మాణాలు ఇతర పలు సంక్షేమ పథకాలు ప్రజలకు అందించామన్నారు. గోషామహల్‌లో బీఆర్ఎస్‌ను అభివృద్ధి చేయడంలో తనదే కీలక పాత్ర ఉందన్నారు. టికెట్ విషయంలో తనకు చెప్పి టికెట్ కేటాయిస్తే తనకు ఎంతో సంతోషంగా ఉండేదన్నారు. పార్టీ అగ్రనాయకులు తనకు చెప్పకుండా టికెట్ కేటాయించడం తనకెంతో బాధవేసిందని పేర్కొన్నారు.

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి

నాంపల్లి: పెండింగ్ డీఏలను విడుదల చేయాలని కోరుతూ టీఎన్జీఓ కేంద్ర సంఘం నేతలు ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్‌కు విజ్ఞప్తి చేశారు. టీఎన్జీఓ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ నేతృత్వంలో ఒక ప్రతినిధి బృందం బుధవారం ప్రధాన ఎన్నికల అధికారిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. దీపావళిని పురస్కరించుకుని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు మూడు పెండింగ్ డీఏల కోసం ఎదురు చూస్తున్నారని, వెంటనే విడుదల చేయడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓ కేంద్ర సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకట్, ప్రతినిధి పర్వతాలు పాల్గొన్నారు.

ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోండి


ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న ఏసీపీ రమేశ్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు

గౌలిపురా: ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ఛత్రినాక డివిజన్ ఏసీపీ రమేశ్ సూచించారు. ఎన్నికలను పురస్కరించుకొని మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం రాత్రి ఆయన మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డీఐ పండరీ, ఎస్సై కృష్ణకాంత్, సిబ్బందితో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ రమేశ్ మాట్లాడుతూ.. ప్రజలకు ఎన్నికల సమయంలో భరోసా కల్పించడంలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు ఎలాంటి భయాందోళన చెందకుండా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

ప్రత్యేక పూజలు



జియాగూడ: కార్వాన్, గోషామహల్ నియోజకవర్గాలకు చెందిన బీఆర్ఎస్ అభ్యర్థులు మిత్రకృష్ణ, నందకిశోర్‌వ్యాస్ తుల్జాపూర్ తుల్జాభవాని మందిరంలో పూజలు చేసి మొక్కులు చెల్లించారు. కొన్ని రోజులుగా బీ-ఫారం అందుకోని మిత్రకృష్ణ, నందకిశోర్ వ్యాస్‌కు మంగళవారం మంత్రి కేటీఆర్ చేతులమీదుగా బీ ఫారంలు అందాయి. దీంతో వారు కార్యకర్తలతో కలిసి తుల్జాపూర్ నిన్నరాత్రే బయల్దేరి ఉదయం పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

స్వయం కృషితో ఎదగడమే నాయకత్వ లక్షణం


మాట్లాడుతున్న ఆచార్య యాదగిరి

దూద్‌బౌలి: స్వయం కృషితో ఎదగడమే నాయకత్వ లక్షణమని కళాశాల విద్యాశాఖ సంయుక్త సంచాలకులు ఆచార్య జి.యాదగిరి అన్నారు. ఎన్ఎస్ఎస్, హార్ట్ ఫుల్నెస్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ సిటీ కాలేజీలో జీవన నైపుణ్యాలు, నాయకత్త లక్షణాలు అనే అంశంపై శిక్షణ ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కాలేజీలకు వచ్చే విద్యార్థులు ఎంతో ఉన్నత విలువలతో కూడిన విద్యాభ్యాసాన్ని పొందుతారన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బాల భాస్కర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విప్లవ దత్ శుక్లా, హార్ట్ ఫుల్నెస్ సంస్థ ప్రతినిధి ఆచార్య కమ్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.